క్లుప్తంగా

ఉత్సాహంగా చదరంగం పోటీలు


విజేతలతో అకాడమీ డైరెక్టర్ విత్తనాల కుమార్

రాజమహేంద్రవరం సిటీ: చదరంగం క్రీడాకారులను ప్రోత్సహించేందుకు నిరంతరం కృషి చేస్తున్నట్లు కాల్‌ఫ్యూషన్ చెస్ అకాడమీ డైరెక్టర్ విత్తనాల కుమార్ తెలిపారు. ఆదివారం అకాడమీలో ఇంటర్నల్ చెస్ పోటీలను నిర్వహించారు. ఈ పోటీల్లో సుమారు 120 మంది క్రీడాకారులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా కుమార్ మాట్లాడుతూ, ఈ టోర్నమెంట్‌లో నాలుగేళ్ల నుంచి 15 ఏళ్లున్న బాలబాలికలు పాల్గొన్నారన్నారు. క్రీడాకారుల స్థాయిని బట్టి బహుమతులు ఇచ్చినట్టు చెప్పారు.

హరిహర క్షేత్రంలో 29న వన సమారాధన


ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్న మార్గాని సత్యనారాయణ, ఇన్‌స్పెక్టర్ వేంకటేశ్వరరావు తదితరులు

కడియం: మండలంలోని కడియపులంకలో ఉన్న హరిహర మహా క్షేత్రంలో ప్రతి ఏటా కార్తిక మాసం మాస శివరాత్రి రోజున భారీ అన్నదానం నిర్వహించడం ఆనవాయితీ. అందులో భాగంగా ఈ నెల 29వ తేదీన వన సమారాధనకు విస్తృత ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ మార్గాని సత్యనారాయణ తెలిపారు. ఈ ఏడాది చివరి కార్తిక శుక్రవారం మాస శివరాత్రి కావడంతో భారీఎత్తున భక్తులు హాజరవుతారని, ఈ మేరకు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. జాతీయ రహదారిని ఆనుకుని ఉన్న నేపథ్యంలో భద్రతా ఏర్పాట్లలో భాగంగా కడియం పోలీస్ ఇన్‌స్పెక్టర్ ఏ.వేంకటేశ్వరరావు ఏర్పాట్లు పర్యవేక్షించారు. మహిళలకు కొత్త పూల మార్కెట్ వద్ద, పురుషులకు ఆలయ ప్రాంగణంలోనూ అన్నదానం చేసే విధంగా చర్యలు చేపట్టామన్నారు. అలాగే ట్రాఫిక్‌కు ఇబ్బందులు కలగకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై చర్చించారు. కార్యక్రమంలో ఆలయ పాలకవర్గం, నర్సరీ రైతులు, స్థానిక పెద్దలు పాల్గొన్నారు.

29న మధుమేహంపై అవగాహన

కంబాలచెరువు: రాజమహేంద్రవరం ఆర్ట్స్ కళాశాలలోని జంతుశాస్త్ర విభాగం ఆధ్వర్యంలో ఈ నెల 29న అంతర్జాతీయ డయాబెటిస్ అవగాహన కార్యక్రమం నిర్వహించనున్నట్టు డాక్టర్ ఎంవీ శేఖర్‌రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా సుగర్ వ్యాధి, థైరాయిడ్ సంబంధిత పరీక్షలను ఉచితంగా చేస్తారని చెప్పారు. ఆ రోజు ఉదయం 7:30 నుంచి సాయంత్రం వరకు కొనసాగుతుందన్నారు.

ఆస్పత్రి వద్ద ఆందోళన

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): వైద్యుల నిర్లక్ష్యంతో తమ బిడ్డ మృతి చెందిందంటూ తల్లిదండ్రులు, కుటుంబీకులు స్థానిక నందం గనిరాజు సెంటర్‌లోని ఆస్పత్రి వద్ద ఆందోళన చేశారు. ఏలేశ్వరం మండలం పెద్ద వీధికి చెందిన బండి లక్ష్మణ్ తన భార్యను కాన్పు కోసం ఆస్పత్రిలో జాయిన్ చేశారు. ఆమెకు కవలలు పుట్టారు. ఒక శిశువు ఆరోగ్యం బాగుండక పోవడంతో చికిత్స చేయగా, చనిపోయినట్టు ఆస్పత్రి సిబ్బంది శనివారం రాత్రి చెప్పారు. దీంతో ఆస్పత్రి వైద్యులతో లక్ష్మణ్ మాట్లాడుతూ, బిడ్డ పరిస్థితి సీరియస్‌గా ఉందని ముందే చెబితే తాము వేరే ఆస్పత్రికి తీసుకువెళ్లే వారమని, ఇప్పటి వరకు వైద్యం కోసం రూ.ఏడు లక్షలు తీసుకుని అన్యాయం చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అతడితో పాటు, కుటుంబ సభ్యులు ఆస్పత్రి వద్ద శనివారం అర్ధరాత్రి ధర్నా చేశారు.

సినిమాలు



శ్యామల	:	మెకానిక్ రాకీ
సూర్యమినీ	:	క
సూర్యప్యాలెస్	:	మెకానిక్ రాకీ
శివజ్యోతి	:	జీబ్రా
అనుశ్రీ	:	దేవకి నందన వాసుదేవ
స్వామి	:	అమరన్
అశోక	:	లక్కీ భాస్కర్
రాజా	:	క
రంభ	:	మందిర
ఊర్వశి	:	కంగువా
మేనక	:	కేశవ చంద్ర రమావత్
కుమారి	:	జీబ్రా
అప్సర	:	మట్కా, లక్కీ భాస్కర్
నామవరం		
వీఎస్ మహల్	:	మెకానిక్ రాకీ
ధవళేశ్వరం		
మురళీకృష్ణ	:	జీబ్రా
కడియం		
వెంకటసూర్య	:	మెకానిక్ రాకీ

ఎక్కడి వారైనా ఓకే!



- ఏపీఎస్ ఆర్టీసీలో వయో వృద్ధులకు 25 శాతం రాయితీ
- దేశంలో ఏ ప్రాంతానికి చెందినా వర్తింపు
- ఇక డిజిటల్ గుర్తింపుతో ఆమోదం
- 60 ఏళ్లు దాటితే అర్హత
- గతంలో రాష్ట్ర వాసులకే అవకాశం

రాజమహేంద్రవరం సిటీ: దేశంలో ఎక్కడి వారైనా ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించే వయో వృద్ధులకు టికెట్ ధరలో 25 శాతం రాయితీ కల్పిస్తూ ఏపీఎస్ ఆర్టీసీ చర్యలు చేపట్టింది. నివాస స్థలంతో సంబంధం లేకుండా ప్రయాణించే వెసులుబాటును సంస్థ కల్పించింది. గతంలో ఆంధ్రప్రదేశ్ వాసులకు మాత్రమే వర్తించే ఈ రాయితీ ఇక నుంచి దేశవ్యాప్తంగా వయో వృద్ధులకు అమలు చేస్తూ ఆదేశాలు వెలువరించింది. వయో వృద్ధులకు రెండు దశాబ్దాల క్రితం ప్రారంభమైన ఈ రాయితీ.. కరోనా సమయంలో తొలగించారు. అనంతరం గత ప్రభుత్వం ఈ రాయితీని పునరుద్ధరిస్తూ చర్యలు చేపట్టింది. తాజాగా దేశవ్యాప్తంగా ఉన్న 60 ఏళ్లు దాటిన వయో వృద్ధులు ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించేలా అవకాశం కల్పించింది.

గుర్తింపు చూపాలి

టికెట్ కొనుగోలు సమయంలో వయస్సును నిర్ధారించే గుర్తింపును బస్సు కండక్టర్‌కు చూపించి, రాయితీ పొందే అవకాశం ఉంది. ఇప్పటి వరకూ వయస్సు నిర్ధారిత పత్రాలను స్వయంగా చూపించే పరిస్థితి ఉండేది. నూతనంగా జారీ చేసిన ఆదేశాలలో డిజిటల్ విధానంలో వయస్సు నిర్ధారిత పత్రాలను కండక్టర్‌కు చూపించి రాయితీ పొందే అవకాశం ఉంది. ఈ రాయితీని సద్వినియోగం చేసుకుని వయో వృద్ధులు రిజర్వేషన్ పొందవచ్చు. ఈ రాయితీ పల్లె వెలుగు బస్సులు మొదలుకొని ఏసీ బస్సులు వరకూ అన్ని రకాల బస్సుల్లో వర్తించేలా చర్యలు చేపట్టారు.

చూపించాల్సిన పత్రాలివే..

- ఆధార్ కార్డు
- సీనియర్ సిటిజన్ ఐడెంటిటీ కార్డు
- ఓటరు గుర్తింపు కార్డు
- పాన్ కార్డు
- రేషన్ కార్డు

వీటిని ప్రత్యక్షంగా లేదా డిజిటల్ విధానంలో కండక్టర్‌కు చూపించవచ్చు.

ఇబ్బందులతో డిజిటల్ విధానానికి చర్యలు

బస్సు ప్రయాణంలో ఆపరేటింగ్ సిబ్బంది టిక్కెట్లను జారీ చేసే సమయంలో తలెత్తుతున్న సమస్యలతో సీనియర్ సిటిజన్ల నుంచి పలు ఫిర్యాదులు అందుతున్నాయి. ప్రత్యక్షంగా వయస్సు నిర్ధారిత పత్రాలు లేని సమయంలో ఆపరేటింగ్ సిబ్బంది పూర్తి చార్జీలు చెల్లించాలనే నిబంధనలు పాటించడంతో, ఉన్నతాధికారులు డిజిటల్ విధానాన్ని అమలులోకి తీసుకువచ్చారు. 60 ఏళ్లు నిండిన దేశంలో సీనియర్ సిటిజన్లు రాష్ట్రంతో సంబంధం లేకుండా, ఏదైనా రాష్ట్ర ప్రభుత్వం, కేంద్ర ప్రభుత్వం జారీ చేసిన భౌతిక రూపం, డిజిటల్ రూపంలో ఉన్న ఏదైనా వయస్సు రుజువును చూపడం ద్వారా 25 శాతం రాయితీ పొందవచ్చు.
– షేక్ షబ్నం, డిపో మేనేజర్, రాజమహేంద్రవరం

మంచి ఆలోచన



ఆర్టీసీ బస్సులో ప్రయాణించే సమయంలో వయో వృద్ధులకు 25 శాతం రాయితీ మంచి నిర్ణయం. వయస్సు నిర్ధారిత పత్రాలు ప్రత్యక్షంగా చూపకపోతే టికెట్ పూర్తి డబ్బులు చెల్లించాల్సి ఉండేది. డిజిటల్ విధానంతో ఇబ్బందులు తొలగిపోనున్నాయి. గతంలో రాష్ట్రంలో ఉన్న వృద్ధులకు మాత్రమే వర్తించే ఈ రాయితీ, దేశంలో ఏ ప్రాంతం వారికైనా అమలు చేయడం బాగుంది.
– పసుపులేటి లక్ష్మీనారాయణ, ప్రయాణికుడు

పేదలకు ఉపయుక్తం



వయో వృద్ధులకు ఆర్టీసీ బస్సు టికెట్‌లో 25 శాతం రాయితీ కల్పించడం ఆనందదాయకం. ఆర్టీసీ నిర్వహించే పల్లె వెలుగు, డీలక్స్, సూపర్ డీలక్స్, అమరావతి, ఇంద్ర తదితర అన్ని బస్సుల్లో అవకాశం కల్పించడం బాగుంది. ప్రధానంగా రాయితీ పేదలకు ఎంతో ఉపయుక్తంగా ఉంటుంది.
– కర్రి సత్యవతి, ప్రయాణికురాలు

దేశ రాజకీయాల్లో ప్రియాంక కీలక పాత్ర

సీడబ్ల్యూసీ సభ్యుడు రుద్రరాజు

రాజమహేంద్రవరం సిటీ: కేరళ రాష్ట్రంలోని వయనాడ్ లోక్‌సభ ఉప ఎన్నికల బరిలో నిలిచిన ప్రియాంక గాంధీ తొలిసారి ప్రత్యక్ష ఎన్నికల్లో అత్యధిక ఓట్ల మెజార్టీతో గెలుపొంది దేశ రాజకీయాల్లో ప్రత్యేకతను చాటుకున్నారని సీడబ్ల్యూసీ సభ్యుడు గిడుగు రుద్రరాజు అన్నారు. ఆదివారం స్థానిక ప్రెస్ క్లబ్‌లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ, భవిష్యత్తులో దేశ రాజకీయాలను ప్రభావితం చేసే విధంగా ప్రియాంక గాంధీ చరిత్ర సృష్టించనున్నారన్నారు. అవినీతి అక్రమాలకు పాల్పడిన వారిపై ప్రభుత్వం చర్యలు చేపట్టాలన్నారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ నాయకులు ఎస్ఎన్ రాజా, బోడా వెంకట్, బాలేపల్లి మురళీధర్ తదితరులు పాల్గొన్నారు.

అభిమానుల వేడుకలు

కేరళ రాష్ట్రం వయనాడ్‌లో ప్రియాంక గాంధీ గెలుపు దేశ రాజకీయాలకు మలుపు కానున్నదని డీసీసీ అధ్యక్షుడు డాక్టర్ టీకే విశ్వేశ్వరరెడ్డి అన్నారు. ఆదివారం స్థానిక క్వారీ సెంటర్‌లో కాంగ్రెస్ పార్టీ


వేడుకల్లో పాల్గొన్న విశ్వేశ్వరరెడ్డి

నాయకులు, కార్యకర్తలు, అభిమానులు వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా టీకే మట్లాడుతూ, వయనాడ్‌లో ప్రియాంక గాంధీ నాలుగు లక్షల పది వేలు పైచిలుకు అత్యధిక ఓట్లతో గెలుపొందారన్నారు. జార్ఖండ్ రాష్ట్రంలో ఇండియా కూటమి ఆధ్వర్యంలో ప్రభుత్వం ఏర్పడుతోందన్నారు. దేశ బడుగు, బలహీన వర్గాలు, నిరుద్యోగులు, యువత సమస్యలపై ఆమె లోక్ సభలో తన వాణి గట్టిగా వినిపించి, వారి సమస్యల పరిష్కారానికి కృషిచేస్తారన్నారు. కార్యక్రమంలో జిల్లా హ్యూమన్ రైట్స్ డిస్ట్రిక్ట్ చైర్మన్ పట్నాల శ్రీనివాస్, అబ్దుల్లా షరీఫ్, హరిబాబు తదితరులు పాల్గొన్నారు.

ఓటు నమోదుపై అవగాహన ర్యాలీ

కడియం: మండల కేంద్రమైన కడియంలో తహసీల్దార్ కె.పోసిబాబు ఆధ్వర్యంలో ఓటు నమోదుపై అవగాహన ర్యాలీ ఆదివారం నిర్వహించారు. 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఓటు నమోదు చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో రెవిన్యూ సిబ్బంది, డ్వాక్రా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

రాజ్యాంగాన్ని సామాన్యులకు చేరువ చేయాలి

మాజీ ఎంపీ ఉండవల్లి

రాజమహేంద్రవరం సిటీ: సామాన్య ప్రజానీకానికి రాజ్యాంగాన్ని చేరువ చేయడానికి రాజ్యాంగ పఠనం చర్చావేదిక ఉపయోగపడుతుందని మాజీ ఎంపీ ఉండవల్లి అరుణ్‌కుమార్ అన్నారు. ఆదివారం స్థానిక లాలాచెరువులోని స్వర్ణాంధ్ర వృద్ధాశ్రమ ప్రాంగణంలో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో రాజ్యాంగ పఠనంపై అవగాహన కరపత్రాన్ని ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సామాన్యుల చెంతకు రాజ్యాంగాన్ని తీసుకువెళ్లాలని ఆలోచన చేసిన ఆస్క్ (అంబేడ్కర్ సేవా కేంద్రం) చైర్మన్ డాక్టర్ గుబ్బల రాంబాబును అభినందించారు. నిర్వాహకుడు డాక్టర్ గుబ్బల రాంబాబు మాట్లాడుతూ, ప్రతి నెలా రాజ్యాంగ పఠనం కార్యక్రమం ద్వారా చర్చా


కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న ఉండవల్లి తదితరులు

వేదికలు ఏర్పాటు చేసి, రాజ్యాంగ నిపుణులతో ప్రజలకు అవగాహన కార్యక్రమాలు చేపడతామని చెప్పారు. అలాగే విరివిగా కరపత్రాలు పంపిణీ చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో నగర ప్రముఖులు అశోక్ కుమార్‌జైన్, నైనాల కృష్ణారావు, స్వర్ణాంధ్ర వ్యవస్థాపకులు పడాల రామిరెడ్డి, శ్రీధర్, హరికృష్ణ, ప్రసాద్, కొండలరావు తదితరులు పాల్గొన్నారు.

జనవరి 5న హైందవ శంఖారావం

రాజమహేంద్రవరం రూరల్: విజయవాడలో వచ్చే ఏడాది జనవరి ఐదున హైందవ శఖారావం కార్యక్రమం జరుగుతుందని ఆర్ఎస్ఎస్ రాజమండ్రి విభాగ్ సహ కార్యవాక రిమ్మలపూడి సుబ్బారాజు తెలిపారు. ఆదివారం బొమ్మూరులోని వివేకానంద మహారోగి ఆరోగ్య కేంద్రంలో జరిగిన బొమ్మూరు మండల సంఘ సమావేశానికి ఆయన అధ్యక్షత వహించారు. వీహెచ్‌పీ ధవళేశ్వరం ఖండ కార్యదర్శి వైఎస్ సుబ్రహ్మణ్యం, వివిధ విభాగాలకు చెందిన సభ్యులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సుబ్బరాజు

డాక్టర్ పట్టాభి సేవలు చిరస్మరణీయం

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): ఆంధ్రాబ్యాంక్ వ్యవస్థాపకుడు డాక్టర్ భోగరాజు పట్టాభి సీతారామయ్య సేవలు చిరస్మరణీయమని యూనియన్ బ్యాంక్ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణా సంస్థ డైరెక్టర్ తాడి శ్రీనివాసరావు కొనియాడారు. బ్యాంకింగ్ రంగంలోను, గ్రామీణాభివృద్ధిలోను, స్వయం ఉపాధి ప్రోత్సాహంలోను ఆయన ఎనలేని సేవలు చేశారని నివాళులర్పించారు. ఆదివారం స్థానిక ఆల్కాట్‌తోటలోని యూనియన్ బ్యాంక్ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణా సంస్థ ఆవరణలో భోగరాజు పట్టాభి సీతారామయ్య జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టాభి సీతారామయ్య విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ, ఈ సంస్థను 1989లో పట్టాభి సీతారామయ్య ప్రారంభించారని, ఇప్పటి వరకు దాదాపు 50 వేల మందికి ఉపాధి కల్పించినట్టు వివరించారు.


పట్టాభి సీతారామయ్య విగ్రహానికి నివాళులర్పిస్తున్న శ్రీనివాసరావు తదితరులు

రుడా చెర్మన్‌ను కలిసిన క్రెడాయ్ ప్రతినిధులు

రాజమహేంద్రవరం సిటీ: రుడా చెర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన బొడ్డు వెంకటరమణ చౌదరిని క్రెడాయ్ రాజమహేంద్రవరం చాప్టర్ ప్రతినిధులు ఆదివారం అభినందనలు తెలిపారు. స్థానిక జేఎన్ రోడ్‌లోని చెరుకూరి కన్వెన్షన్‌లో జరిగిన ఆయన అభినందన సత్కారోత్సవ కార్యక్రమానికి క్రెడాయ్ ప్రతినిధులు హాజరయ్యారు. చైర్మన్ బుడ్డిగ శ్రీనివాస్, అధ్యక్షులు సూరవరపు శ్రీనివాసకుమార్, మన్యం సంతోష్ ఫణికుమార్, ఉపాధ్యక్షులు రెడ్డి రామకృష్ణ, మట్టపల్లి రంగప్రసాద్, పూడి వెంకట శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శి చల్లా బాలమురళీకృష్ణ, కోశాధికారి టీవీఎల్ నరసింహారావు, తదితరులు ఉన్నారు.


రుడా చైర్మన్‌ను అభినందిస్తున్న క్రెడాయ్ ప్రతినిధులు

మార్గానికి లయన్స్ ఉత్తమ సేవా పురస్కారం

కడియం: పలు సంఘ సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్న కడియపులంకకు చెందిన నర్సరీ రైతు మార్గాని సత్యనారాయణకు ఉత్తమ సంఘ సేవకుడిగా ఇంటర్నేషనల్ లయన్స్ క్లబ్ ఆదివారం ఘనంగా సత్కరించింది. శ్రీవీరహనుమాన్ నర్సరీలో జిల్లా 316బి లయన్స్ ఇంటర్నేషనల్ మహిళలు ఏర్పాటుచేసిన కుమారి సంభవం అనే కార్యక్రమంలో లయన్స్ క్లబ్ డిస్ట్రిక్ట్ గవర్నర్ ఈవీవీ ఈశ్వర్‌కుమార్, లయన్స్ పాస్ట్ డిస్టిక్ గవర్నర్ గ్రంధి వెంకటేశ్వరరావు, లయన్స్ జోన్ చైర్మన్ కొయ్యన కుమారి, పాస్ట్ డిస్టిక్ గవర్నర్ మాటూరి మంగతాయారు చేతుల మీదుగా లయన్స్ క్లబ్ ఉత్తమ సంఘ సేవా పురస్కారాన్ని మార్గాని అందుకున్నారు. రాబోయే రోజుల్లో మరిన్ని సంఘ సేవ కార్యక్రమాలు నిర్వహించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పీఎస్టీలు అల్లడ కవిత గొందేశి మాధవీలత, అరుణ కుమారి, పలువురు క్లబ్ ప్రతినిధులు పాల్గొన్నారు.



మార్గానికి అవార్డును అందజేస్తున్న క్లబ్ ప్రతినిధులు

మసాజ్ సెంటర్‌పై పోలీసుల దాడి ఇద్దరి అరెస్టు

కంబాలచెరువు(రాజమహేంద్రవరం): బ్యూటీ సెలూన్ షాపు పేరుతో స్పా నిర్వహిస్తున్న మసాజ్ సెంటర్‌పై ఒకటో నగర పోలీసులు ఆదివారం రాత్రి దాడి చేశారు. దీనికి సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. తాడితోటలో సతీష్, లక్ష్మి అనే వారు ఓ బ్యూటీ సెలూన్‌ను నిర్వహిస్తున్నారు. అయితే ఆ బ్యూటీ సెలూన్‌లో అసాంఘిక కార్యకలాపాలు నిర్వహిస్తున్నట్లు పోలీసులకు సమాచారం అందింది. దీంతో ఆ బ్యూటీ సెలూన్‌పై దాడి చేశారు. ఆ సమయంలో మసాజ్ చేస్తున్న ఇద్దరు యువతులు, ముగ్గురు యువకులు పోలీసులకు పట్టుబడ్డారు. వారిని పోలీసులు అదుపులోకి తీసుకుని ఆ సెంటర్‌ను మూసివేశారు. ఈ దాడిలో ఇద్దరు నిర్వాహకులను పోలీసులు అరెస్టు చేశారు.

జూదరుల అరెస్టు

కడియం: దుళ్లలోని ఒక తోటలో పేకాట ఆడుతున్న 24 మందిని శనివారం రాత్రి అరెస్టు చేసినట్టు కడియం పోలీస్ ఇన్‌స్పెక్టర్ ఎ.వేంకటేశ్వరరావు తెలిపారు. వారి నుంచి రూ.90,340 నగదు స్వాధీనం చేసుకున్నామని చెప్పారు. నిందితులను కోర్టుకు తరలిస్తామన్నారు.

ఉల్లాసంగా.. ఉత్సాహంగా..


కార్తిక వన సమారాధనలో పాల్గొన్న దేవాంగ సంఘీయులు


కృపావతిని సత్కరిస్తున్న పూర్వ విద్యార్థులు


శ్రీగౌరీ సేవా సంఘం వన సమారాధనలో సురేంద్ర తదితరులను సత్కరించిన సభ్యులు


దుళ్లలో ఉసిరి చెట్టు వద్ద పూజలు చేస్తున్న సభ్యులు

రాజమహేంద్రవరం రూరల్: రాజమహేంద్రవరం దేవాంగ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో చెరుకూరి గార్డెన్స్‌లో కార్తిక వన సమారాధన ఆదివారం ఘనంగా జరిగింది. సంఘ నగర అధ్యక్షుడు రొబ్బి విజయశేఖర్ అధ్యక్షత వహించారు. శివపార్వతులకు సంఘ నగర ప్రధాన కార్యదర్శి కాలేపు సత్యనారాయణమూర్తి పూజలు నిర్వహించారు. సుమారు 12 వేల మంది సంఘీయులు ఆటపాటలతో ఉల్లాసంగా గడిపారు. ముఖ్యఅతిథిగా జాంపేట కో–ఆపరేటివ్ అర్బన్ బ్యాంకు చైర్మన్ బొమ్మన జయకుమార్ హాజరయ్యారు. దేవాంగులు అన్ని రంగాల్లో ముందుకు సాగాలని రొబ్బి విజయశేఖర్ ఆకాంక్షించారు. సంఘ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పుచ్చల రామకృష్ణ, సంఘ పెద్దలు కేకే సంజీవరావు, గంపా సోమలింగేశ్వరరావు, ద్వారా పార్వతి సుందరి, చింతా చలపతి తదితరులు పాల్గొన్నారు.

కళింగ సంఘ పటిష్టతకు కృషి

కళింగ సంఘం పటిష్టతకు అన్ని చర్యలు తీసుకుంటామని రాష్ట్ర కళింగ కార్పొరేషన్ డైరెక్టర్లు మొజ్జాడ నాగరాజు, నంబాల సీతారామాంజనేయులు అన్నారు. ఆదివారం శాటిలైట్‌సిటీలోని తోటలో జరిగిన కళింగ వన సమారాధనకు కళింగ సంక్షేమ సేవా సంఘం అధ్యక్షుడు, విశ్రాంత డిప్యూటీ డైరెక్టర్ మెట్ట మల్లేశ్వరరావు అధ్యక్షత వహించారు. అతిథులుగా వచ్చిన డైరెక్టర్లు మాట్లాడుతూ, ప్రభుత్వ దృష్టికి సమస్యలను తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. రాజమండ్రి లా కాలేజ్ ప్రిన్సిపాల్ మధుసూదనరావు, బాలల హక్కుల


వెలమ సంఘీయుల వన సమారాధనలో పాల్గొన్న ఎమ్మెల్యే ఆదిరెడ్డి తదితరులు

పరిరక్షణ వేదిక శ్రీకాకుళం జిల్లా కన్వీనర్ కొత్తకోట శ్రీనివాసరావు, రివర్ బే మేనేజర్ అన్నేపు సురేష్, సర్పంచ్ గురుగుబిల్లి కుమారి, కళింగ నేతలు బాల కృష్ణ, సూరిబాబు మొదలవలస వెంకటేశ్వర్లు తదితరులు మాట్లాడారు. వివిధ ఆటల పోటీలు నిర్వహించి, బహుమతులు అందజేశారు.

వెలమ సంఘీయుల వన సమారాధన

శాటిలైట్ సిటీ గ్రామ సమీపంలోని గొర్రెల వీర సూర్య అప్పారావు తోటలో ఆదివారం వెలమ సంఘీయుల వన సమారాధన ఘనంగా జరిగింది. ఉసిరి చెట్టుకు పూజతో వన సమారాధన ప్రారంభమైంది. మాజీ మేయర్ ఆదిరెడ్డి వీరరాఘవమ్మ, ఇతర మహిళలు పూజలు చేశారు. ముఖ్య అతిథి ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ మాట్లాడుతూ, వెలమ సంఘీయుల సమస్యల పరిష్కారానికి కృషిచేస్తామన్నారు. సంఘ జిల్లా గౌరవాధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్సీ ఆదిరెడ్డి అప్పారావు, నగర గౌరవాధ్యక్షుడు చల్లా శంకరరావు, నగర అధ్యక్షులు కిలపర్తి శ్రీనివాస్, వెలమ సంఘ పెద్దలు చలుమూరి శ్రీను, అల్లు బాబీ, కోళ్ల బాబు, గంటా ఉమా, సప్పా వెంకటరమణ, వెలమ యువత అధ్యక్షులు కొల్లి బుజ్జి తదితరుల పర్యవేక్షణలో ఈ వన సమారాధన జరిగింది. సుమారు 35 వేల మంది హాజరయ్యారు. వివిధ రకాల ఆటల పోటీలతో సందడిగా సాగింది. అలాగే వెలమ సంక్షేమ సంఘ ఉచిత వివాహ వేదిక కూడా నిర్వహించారు.


కుమ్మర శాలివాహనుల వన సమారాధనలో మాట్లాడుతున్న మంత్రి దుర్గేష్

సమాజ శ్రేయోభిలాషులు కుమ్మర శాలివాహనులు : మంత్రి దుర్గేష్

సమాజ శ్రేయోభిలాషులు కుమ్మర శాలివాహనులని రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. ఆదివారం స్థానిక మోరంపూడిలోని జూపూడి వారి తోటలో జిల్లా కుమ్మర శాలివాహనుల వన సమారాధన నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన మంత్రి దుర్గేష్ మాట్లాడుతూ, కుమ్మర్లకు ప్రభుత్వ ఫలాలు అందేందుకు కృషి చేస్తానన్నారు. ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ మాట్లాడుతూ, కుమ్మర్లకు అన్ని విధాలా సహకారం అందిస్తానన్నారు. రాష్ట్ర కుమ్మర శాలివాహన ఫెడరేషన్ చైర్మన్ తుగ్గాలి నాగేంద్ర, రాజమహేంద్రవరం కుమ్మర శాలివాహన వన సమారాధన కమిటీ కన్వీనర్ మెరుగుమెల్లి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు. ఆటపాటలతో ఉల్లాసంగా గడిపారు. పలువురు ప్రముఖులను సత్కరించారు.

శ్రీగౌరీ సేవా సంఘం వారి..

బొమ్మూరులోని దండు సుబ్బరాజు తోటలో ఆదివారం రాజమండ్రి శ్రీగౌరీ(గవర) సేవా సంఘం వన సమారాధన ఘనంగా జరిగింది. ముఖ్య అతిథులుగా రాష్ట్ర గవర కార్పొరేషన్ చైర్మన్ మళ్ల సురేంద్ర, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ తనకాల నాగేశ్వరరావు, యల్లపు పాండురంగారావును ఘనంగా సత్కరించారు. వినోద కార్యక్రమాలు, ఆటపాటల్లో పిల్లలు, మహిళలు ఉత్సాహంగా పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల వన సమారాధన

కడియం: ఎక్కడెక్కడో స్థిరపడి వివిధ హోదాల్లో ఉద్యోగాలు, వ్యాపారాలు, వ్యవసాయాలు చేసుకుంటున్న పూర్వ విద్యార్థులు ఆదివారం స్థానిక గాంధీ నర్సరీలో కార్తిక వన సమారాధనలో కలుసుకున్నారు. కడియం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1982–83 పదో తరగతి బ్యాచ్ విద్యార్థులు అమ్మమ్మ, తాతయ్యల హోదాలో కుటుంబ సభ్యులతో కలిసి అలనాటి ముచ్చట్లను నెమరువేసుకున్నారు. ఆటపాటలతో ఉల్లాసంగా నర్సరీల్లో గడిపారు. తమతో పాటు చదువుకుని, ఉపాధ్యాయ వృత్తిలో కొనసాగుతూ జిల్లాస్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయిని అవార్డు అందుకున్న వర్ధనపు కృపావతిని ఘనంగా సత్కరించారు. ప్రతి ఏటా కలుసుకోవాలని, ఆర్థికంగా వెనుకబడిన సహచరుల కుటుంబాలను ఆదుకునేందుకు తీర్మానించారు.

చౌడేశ్వరి దేవాంగుల ఆధ్వర్యంలో..

దుళ్ల గ్రామానికి చెందిన శ్రీచౌడేశ్వరి దేవాంగ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో కార్తిక వన సమారాధన ఉత్సాహంగా జరిగింది. గ్రామంలోని కోకో తోటలో జరిగిన ఈ కార్యక్రమానికి పెద్దఎత్తున సంఘీయులు హాజరయ్యారు. ఉసిరిచెట్టు వద్ద ప్రత్యేక పూజలు చేసి, సహపంక్తి భోజనాలు చేశారు. కార్తిక మాసం చివరి ఆదివారం కావడంతో మండలంలోని పలు గ్రామాల్లో వన సమారాధనలు జరిగాయి. కడియపులంక, జేగురుపాడు తదితర గ్రామాల్లో ఉసిరి చెట్లు వద్ద కార్తిక దామోదరుడిని పూజించారు. మహిళలు, పిల్లలు, పెద్దలు ఉత్సాహభరిత వాతావరణంలో, ఆటపాటలతో గడిపారు.